సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం ‌• 6 ‌• జూన్ ‌• 2024



సోమశిలలో 7.320 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 7.320 టీఎంసీలు ఉన్నాయి. దిగువకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.74,200
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,646
3 శాతం జీఎస్టీతో	రూ.6,845
నవర (8 గ్రా)	రూ.54,760

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.7 /29.3

జిల్లా వ్యాప్తంగా వాతావణంలో తేమ 68 శాతం ఉంది. గురువారం వాతావరణం మధ్యాహ్నం ఉక్కపోతగా, సాయంత్రం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నుడా చైర్మన్ పదవికి ముక్కాల రాజీనామా



ముక్కాల ద్వారకానాథ్

నెల్లూరు (బారకాసు): సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ తన పదవికి రాజీనామా చేశారు. ముక్కాల ద్వారకానాథ్ తన రాజీనామా లేఖను బుధవారం ప్రభుత్వ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి పంపారు. తక్షణమే తన రాజీనామాను ఆమోదించాలని అందులో కోరారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ. 331

కలిగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ. 331 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 771 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 697 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారు. 74 బేళ్లను వివిధ కారణాలతో కొనుగోలు తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ మాట్లాడుతూ కిలో పొగాకుకు గరిష్టంగా రూ.331, కనిష్టంగా రూ.205 ధర పలికింది. సగటున కిలో పొగాకుకు రూ.290.50 లభించిందన్నారు. వేలంలో 17 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

డీసీపల్లిలో 613 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో బుధవారం 613 పొగాకు బేళ్లు విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 657 బేళ్లు రాగా వాటిలో 613 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో 75,925 కిలోల పొగాకు విక్రయించగా రూ.2,08,52,633 వ్యాపారం జరిగింది. కిలో ధర గరిష్టంగా రూ.331, కనిష్టంగా రూ.204 ధర లభించింది. సగటు ధర రూ.274.65గా నమోదైంది. వేలంలో 23 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాతీర్పును గౌరవిస్తున్నాం

- ఎన్నికైన కొత్త ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో టీడీపీకి ప్రజలు అవకాశం కల్పించారని, ఈ తీర్పును తాము గౌరవిస్తున్నామని మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నగరంలోని మాగుంట లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నాయకులతో కలిసి కాకాణి విలేకరులతో సమావేశంలో మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన తీర్పుపై ఆశ్చర్యం, బాధ కలుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. విద్య, వైద్యం వ్యవసాయం అనేక సంక్షేమ పథకాలకు సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ దాదాపుగా పూర్తి చేశారన్నారు. రాష్ట్ర ప్రజలకు పూర్తిగా అండగా నిలిచారన్నారు. ప్రజలు తీసుకున్న నిర్ణయానికి కారణాలను అంతర్గతంగా సమీక్షిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచిన నాయకులు, కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం అహర్నిశలు పని చేసిన అందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అధికారం, పదవి లేకపోయినా అందరితో మమేకమై జిల్లాలోని ఏ ఒక్క నాయకుడికి కష్టం, నష్టం కలగకుండా అండగా ఉంటామన్నారు. కార్యకర్తలు ఎటువంటి పరిస్థితుల్లో అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. జరిగిన అపజయాలపై సమీక్షించుకుంటామన్నారు. నిత్యం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలపై పోరాడుతామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ అభివృద్ధికి, అన్ని విధాలా కష్టపడి పని చేస్తామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి విధి విధానాలపై స్పష్టంగా వివరించారన్నారు. గ్రామాల్లో సచివాలయాలు నాడు నేడు విలేజ్ హెల్త్‌క్లినిక్, వలంటీర్ వ్యవస్థలతో పాటు సంక్షేమ పథకాలను పార్టీకతీతంగా నేరుగా అర్హత కలిగిన వారికి అందజేశారన్నారు. అవినీతి, ఆస్కారం లేకుండా నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేసే విధానాన్ని ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. అయినా సరే ప్రజలు మొగ్గుచూపలేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు కుటుంబ సభ్యులుగా ఉంటామని, ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకుంటామన్నారు. జిల్లాలో ఉండే ప్రధానమైన నాయకులందరి పైన కార్యకర్తల రక్షణపై బాధ్యతగా ఉంటామన్నారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ముందుకు వెళ్లాలన్నారు. వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం ఓటు వేసి ఆదరించిన నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అండగా ఉంటామన్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు తెలిపారు.

మలేరియాను నివారిద్దాం

- జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ

నెల్లూరు(అర్బన్): మలేరియాను నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ కోరారు. మలేరియా నివారణ మాసోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నెల్లూరు సుబేదారుపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా లాంటి వ్యాధులు వస్తున్నాయన్నారు. పలు సందర్భాల్లో ప్రాణాంతకంగా మారుతున్నాయన్నారు. దోమలు కుట్టడం వల్లే ఇలాంటి జబ్బులు వస్తున్నాయన్నారు. అందువల్ల దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలన్నారు. ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ చేరకుండా చూసుకోవాలన్నారు. నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. ప్రజలు ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించి తమ ఇళ్లలోని నీటి ట్యాంకులు, తొట్టెలు లాంటి వాటిని శుభ్రం చేయాలన్నారు. దోమ తెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతిమ, షబ్నా, ఆశా కార్యకర్త మాధవి, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, హెల్త్ అసిస్టెంట్ నందకుమార్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న హుస్సేనమ్మ తదితరులు

గోడౌన్‌లకు ఈవీఎంల తరలింపు

- కలెక్టర్ ఎం.హరినారాయణన్ పర్యవేక్షణలో గోడౌన్‌కు సీల్

నెల్లూరు(దర్గామిట్ట): 2024 సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఎన్నికలకు వినియోగించిన ఈవీఎంలను నెల్లూరు నగరంలోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న ఈవీఎంలు భద్రపరిచే గోడౌన్లకు తరలించారు. బుధవారం సాయంత్రం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ గోడౌన్‌లో భద్రపరిచి సీల్ వేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్, ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు మలోల, ప్రేమ్‌కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్రీనివాస రసూల్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంలను భద్రపరిచి సీళ్లు వేస్తున్న గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

ప్రతిపక్షంగా ప్రజల కోసం పోరాడుతాం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని, ప్రతిపక్షంగా ప్రజల కోసం పోరాడుతామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నెల్లూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలకు అన్ని విధాలా మేలు చేసిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగులకు 4.86 లక్షల ఉద్యోగాలు కల్పించిందన్నారు. రాష్ట్రంలో కొత్త మెడికల్ కళాశాలలు, నూతన పోర్టులు, గ్రామ, వార్డు సచివాలయాలు, ఆర్‌బీకేలు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అర్బన్ ప్రైమరీ హెల్త్ క్లినిక్‌లు ఇలా అనేక సంస్కరణలతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు సేవలు అందించిందన్నారు. అయినప్పటికి 40 శాతం మంది ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి పార్టీకి అండగా నిలిచారన్నారు. వారందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. రాబోయే ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలకు అండగా ఉంటూ ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా ముందుండి పోరాడుతుందని తెలిపారు. టీడీపీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలకు అండగా నిలబడాలని వైఎస్సార్‌సీపీ కోరుకుంటుందన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు అండగా వైఎస్సార్‌సీపీ సేవలు అందిస్తుందని తెలిపారు.



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

ఎన్‌డీసీసీ బ్యాంకు డైరెక్టర్ పదవికి రాజీనామా

విింజమూరు(ఉదయగిరి): ఎన్‌డీసీసీ బ్యాంకు డైరెక్టర్ పదవికి తాను రాజీనామా చేస్తున్నట్లు వింజమూరుకు చెందిన మద్దూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయినందున నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేసి ఆ పత్రాన్ని బ్యాంకు సీఈఓకు అందజేసినట్లు చెప్పారు.



లక్ష్మీప్రసాద్‌రెడ్డి

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కందుకూరు: ప్రమాదవశాత్తు బస్సు కిందపడి ఓ యువకుడు మృతిచెందిన ఘటన కందుకూరు మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. లింగసముద్రం మండలం అన్నెబోయినపల్లి గ్రామానికి చెందిన బండ్లమూడి పాపయ్య కుమారుడు మవీన్ (23) కందుకూరులోని ఓ జెరాక్స్ షాపులో పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం అన్నెబోయినపల్లి నుంచి షాపునకు వెళ్లేందుకు తన స్నేహితుడితో కలిసి మోటార్‌బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో కొండముడుసుపాళెం వద్ద ముందు వెళ్తున్న ఆటోను క్రాస్ చేసే సమయంలో ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. దీంతో కందుకూరు నుంచి గుడ్లూరు వైపు వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు మవీన్ పైనుంచి వెళ్లింది. అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మరో యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫలితాలపై ఎన్నెన్నో అనుమానాలు

సార్వత్రిక ఎన్నికల ఫలితాలకు సంబంధించి ప్రజల్లో అనేకానేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తామంతా వైఎస్సార్‌సీపీకే ఓట్లు వేస్తే.. టీడీపీ ఎలా గెలిచిందంటూ పలువురు ఓటర్లు నిలదీస్తున్నారు. ఈవీఎంల్లో ఏదో మోసం చేశారంటూ అనుమానాలు వ్యక్తం చేశారు. ఫలితాలు తీవ్ర నిరాశకు గురి చేశాయి. ఈ విషయంలో పూర్తి స్థాయిలో విచారణ జరపాల్సిన అవసరం ఉంది.

– సాక్షి నెట్‌వర్క్



జీర్ణించుకోలేకున్నాం



మాది పెనుబల్లి మజరా ప్రాంతం సాల్మన్ పురం. మా పోలింగ్ బూత్ నంబర్ 67. మొత్తం 564 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్‌సీపీకి 450కి పైగా ఓట్లు వస్తాయని భావించాం. అయితే 370 వచ్చాయి. ఇక్కడ 95 శాతానికి పైగా జగన్ వైపే మొగ్గు చూపారు. మెజారిటీ తగ్గడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

– కె.చంద్రశేఖర్, పెనుబల్లి, బుచ్చిరెడ్డిపాళెం మండలం

ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి



మాది కేశవరం పంచాయతీ. ఇక్కడ రెండు బూత్‌ల్లో 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 302 ఓట్ల మెజారిటీ వచ్చింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికీ అందించిన సంక్షేమ పథకాల వల్ల సుమారు 700 ఓట్ల మెజారిటీ వస్తుందని ఆశించాం. అయితే 259 ఓట్లు వచ్చాయి. ఫలితాలు తీవ్ర నిరాశకు గురి చేశాయి. ఈవీఎంలపై అనుమానం వస్తోంది.

– రావి ప్రసాద్‌నాయుడు, కేశవరం పంచాయతీ, జలదంకి మండలం

మాయ జరిగింది



మా పోలింగ్ బూత్ నంబర్ 69. మొత్తం 831 ఓట్లు పోలయ్యాయి. మా కాలనీలో దళితులందరూ ఫ్యాన్ గుర్తుకే ఓట్లు వేశారు. వైఎస్సార్‌సీపీకి 490, టీడీపీకి 324 ఓట్లు వచ్చాయి. టీడీపీకి అన్ని ఓట్లు రావడం అనుమానాలకు తావిస్తోంది. ఇందులో ఏదో మాయ జరిగింది. దీనిపై నాకు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మోసాన్ని బయటకు లాగాలి.

– చెముడుగుంట కృష్ణయ్య, చెల్లాయపాళెం, బుచ్చిరెడ్డిపాళెం మండలం

షాక్‌కు గురయ్యాం



మా పోలింగ్ బూత్ నంబర్ 244. టీడీపీకి 395 ఓట్లు, వైఎస్సార్‌సీపీకి 176 ఓట్లు వచ్చాయి. ఈ ఊరిలో చాలామంది ఫ్యాన్ గుర్తుకే ఓట్లు వేశారు. అయితే తుది ఫలితాలు విస్మయానికి గురి చేశాయి. అన్ని వర్గాలకు మంచి చేసిన ప్రభుత్వానికి ఇంత తక్కువ ఓట్లు రావడాన్ని జీర్ణించుకోలేకున్నాం. ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన ఎంతోమంది మహిళలు వైఎస్సార్‌సీపీకే ఓటు చేశామని చెప్పారు. కానీ టీడీపీకి వచ్చిన మెజారిటీని చూసి షాక్‌కు గురయ్యాం. ఎన్నికల అనంతరం ఏదో జరిగిందనే అనుమానం తొలుస్తోంది.

– ఈగా సురేష్, వడ్లపూడి, మనుబోలు మండలం

మోసం జరిగి ఉంటుంది



మాది మహిమలూరు. బూత్ నంబర్ 115 పరిధిలో 1,200కు పైగా ఓట్లున్నాయి. 2019లో వైఎస్సార్‌సీపీకి భారీ మెజారిటీ వచ్చింది. బీసీలందరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే మద్దతుగా నిలిచారు. మా గ్రామంలోనూ వైఎస్సార్‌సీపీకి అధికంగా ఓట్లు పడ్డాయి. తీరా చూస్తే మెజారిటీ 89 ఓట్లు మాత్రమే వచ్చాయి. మేం ఇంకా ఎక్కువ వస్తాయని ఆశించాం. మేకపాటి విక్రమ్‌రెడ్డి ఓడిపోవడంపై మాకు చాలా అనుమానాలున్నాయి.

– నలగట్ల మస్తానయ్య, బీసీ నాయకుడు, మహిమలూరు, ఆత్మకూరు మండలం

నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు

- వైఎస్సార్‌సీపీ నాయకుడు ఖలీల్ అహ్మద్



మాట్లాడుతున్న ఖలీల్ అహ్మద్

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల్లో తన కోసం పని చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఖలీల్ అహ్మద్ ధన్యవాదాలు తెలిపారు. నెల్లూరులోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా సామాన్యుడినైన తనను నమ్మి నెల్లూరు సిటీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నానన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్త, నాయకుడికి రుణపడి ఉంటానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కొత్తగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా సమస్యలపై పోరాటం చేస్తాం



మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: క్షేత్రస్థాయిలోనే ఉంటూ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని, ప్రజలకు అండగా ఉంటామని మేకపాటి రాజగోపాల్ రెడ్డి, అభినవ్‌రెడ్డి తెలిపారు. ఉదయగిరిలో బుధవారం రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఉదయగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఓటరుకు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఊహించని విధంగా ఫలితం వచ్చిందన్నారు. అయినా గెలుపొందిన అభ్యర్థికి, తనకు మధ్య తేడా అతి స్వల్పమేనన్నారు. ఉదయగిరిలోనే అందుబాటులో ఉంటామన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఎన్నికల్లో గెలుపోటములు సర్వసాధారణమని, ఎవరూ అధైర్యపడొద్దన్నారు. లోటుపాట్లను సమీక్షించుకుంటామన్నారు. నియోజకవర్గంలో ఏ కార్యకర్తకు, నేతకు కష్టమొచ్చినా అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. త్వరలోనే బూత్‌స్థాయిలో సమీక్షలు పార్టీని బలోపేతం చేసేందుకు అందరం కలిసికట్టుగా పనిచేస్తామన్నారు.

ఓటర్ల తీర్పును గౌరవిస్తున్నా

- బుర్రా మధుసూదన్ యాదవ్



మాట్లాడుతున్న మధుసూదన్ యాదవ్

కందుకూరు: 'ఎన్నికల్లో 90,640 మంది ఓటర్లు నాకు అండగా నిలిచారు. వారికి రుణపడి ఉంటా. గెలుస్తానని బలంగా నమ్మాను. అయితే ప్రజలిచ్చిన తీర్పును గౌరవిస్తున్నా' అని వైఎస్సార్‌సీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానన్నారు. చంద్రబాబు నాయుడు చెప్పిన మాయమాటలు నమ్మి ప్రజలు వారికి ఓట్లు వేశారన్నారు. ఎన్నికలకు ముందు తక్కువ సమయంలోనే ఈ నియోజకవర్గానికి వచ్చినా ప్రజలు ఎంతో ఆదరించారని తెలిపారు. ఓటమికి కారణాలను విశ్లేషించుకుంటామన్నారు. ఓడినంత మాత్రాన నియోజకవర్గాన్ని వదిలి వెళ్లే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. కందుకూరులోనే ఇల్లు నిర్మించుకుని ఇక్కడే ఉంటానని చెప్పారు. ప్రజల సమస్యలపై నిర్మాణాత్మకమైన ప్రతిపక్షంగా పోరాటం చేస్తానని వివరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గంలోని ప్రతి ఊరికి, పంచాయతీకి వెళ్లినట్లు తెలిపారు.కందుకూరులోనే రాజకీయ ప్రస్థానం ప్రారంభించినట్లు చెప్పారు. 2014లో కనిగిరి నుంచి పోటీ చేసి ఓడిపోయినా ఐదేళ్ల పాటు పోరాటాలు చేసి 2019 ఎన్నికల్లో 42 వేల భారీ మెజార్టీతో విజయం సాధించానని గుర్తు చేశారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. అలాగే ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధైర్యపడొద్దని, రాజకీయాల్లో గెలుపోటములు సహజమేనని చెప్పారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి, ఓట్లు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

పోర్టు రోడ్డుపై ట్రాక్టర్ బోల్తా

వెంకటాచలం: మండలంలోని తాటిపర్తిపాళెం సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై పొట్టు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు నుంచి పంటపాళెనికి ట్రాక్టర్ వెళ్తోంది. అకస్మాత్తుగా గేదెలు అడ్డు రావడంతో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ వెంకటయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.75
సన్నవి : రూ.35
పండ్లు : రూ.25



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	156
లేయర్ (లైవ్)	120
బ్రాయిలర్ చికెన్	274
బ్రాయిలర్ స్కిన్‌లెస్	304
లేయర్ చికెన్	204

ప్రజల వెన్నంటే ఉంటా

- రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న రామిరెడ్డి

కావలి: 'కావలి నియోజకవర్గ ప్రజల వెన్నంటే ఉంటా. ఈ ప్రాంత సమగ్రాభివృద్ధే నా లక్ష్యం' అని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవంగా స్వీకరిస్తున్నట్లు తెలిపారు. గెలుపోటములతో సంబంధం లేకుండా కావలి ప్రగతికి పునరంకితం కావడంతోపాటు తనను నమ్మి వెంట నడిచిన కార్యకర్తలు, అభిమానులకు అండగా ఉంటానని స్పష్టం చేశారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఓటేసిన ప్రజలు, పార్టీ కార్యకర్తలకు అండగా ఉండి వారిని కాపాడుకుంటామన్నారు. ఐదు సంవత్సరాలపాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావలి నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిగా సహకారం అందించారని తెలిపారు. పట్టణ ప్రగతికి కీలకమైన రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్‌కు నిధులు కేటాయించడంతోపాటు సంక్షేమ పథకాల రూపంలో ఆర్థికంగా భరోసా కల్పించారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇంటింటికీ తిరిగి పథకాలు అందని లబ్ధిదారులను గుర్తించామన్నారు. వారికి పథకాలు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి క్షణం ప్రజల కోసమే పరితపించినా ఫలితాలు మాత్రం భిన్నంగా వచ్చాయన్నారు. రాష్ట్రమంతా కూటమి గాలి వీయడంతో కావలి నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజా తీర్పును గౌరవిస్తున్నట్లు చెప్పారు. గెలుపోటములను పరిగణలోకి తీసుకోకుండా ప్రజాక్షేత్రంలోనే ఉంటామని స్పష్టం చేశారు. తనను ఆదరించిన ప్రజలందరికీ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

నీట్ ఫలితాల్లో విశ్వసాయి ప్రభంజనం



అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో విశ్వసాయి కళాశాల చైర్మన్ సత్యనారాయణ తదితరులు

నెల్లూరు(అర్బన్): నీట్ ఫలితాల్లో విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభను చాటారని ఆ విద్యాసంస్థ చైర్మన్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ, వైస్ చైర్మన్ కృష్ణమోహన్ తెలిపారు. బుధవారం స్థానిక కళాశాలలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. వారు మాట్లాడుతూ తమ కళాశాలలో 110 మందికి పైగా ఎంబీబీఎస్, బీడీఎస్‌లో చేరడానికి అర్హత సాధించారన్నారు. వారిలో దీక్షిత 658 మార్కులు, ప్రేమ్‌సాయి 636, యశ్వంత్‌కుమార్ 632, పూజిత 626, గురుచంద్రిక 625, సాయిశ్రియ 620, శ్లోకారెడ్డి 612, సత్యకార్తికేయ 600 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ఒకే కళాశాల నుంచి 110 మందికి పైగా డాక్టర్ కోర్సులో చేరడం తమకు ఎంతో సంతోషాన్నిస్తుందన్నారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ, ఒత్తిడి లేని శిక్షణ, 5 స్టెప్ ప్రోగ్రాంలతో విజయాలు సాధించామన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్‌పర్సన్ రుక్మిణి, అధ్యాపకులు పాల్గొన్నారు.